

స్పౌజ్ బదిలీలు చేపట్టాలి

ఆర్మూర్‌టౌన్, జనవరి 13: స్పౌజ్ బదిలీలు చేపట్టాలని పలువురు ఉపాధ్యాయులు పట్టణంలోని పీవీఆర్ భవనంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జీ వినయ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. గతప్రభుత్వం తీసుకువచ్చిన అశాస్త్రీయ విధానాల వల్ల ఉద్యోగస్తులైన భార్యభర్తలు వివిధ జిల్లాలకు బదిలీ అయ్యారని అన్నారు. ఒకే జిల్లాలో పనిచేయాల్సి ఉన్నా 19 జిల్లాల్లో స్పౌస్ బదిలీలు జరిపి 13 జిల్లాలో చేపట్టలేదని, సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి స్పౌజ్ బదిలీలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



- మిల్లులకు కేటాయించిన ధాన్యంపై అధికారుల నజర్
- బియ్యం సరఫరా చేయని మిల్లులపై ప్రభుత్వం సీరియస్
- ఎఫ్‌సీఐకి బియ్యం సరఫరా అధికారుల చేసేందుకు ప్రయత్నాలు
- ధాన్యం పక్కదారి పట్టిస్తున్న మిల్లులపై చర్యలు: ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

సీఎంఆర్‌పై నిఘా!



నిజామాబాద్, జనవరి13(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో రైస్ మిల్లులకు కేటాయించిన ధాన్యంపై అధికార యంత్రాంగం నిఘా పెట్టింది. కస్టం మిల్లింగ్ రైస్ (సీఎంఆర్)పై కొత్త ప్రభుత్వం సీరియస్‌గా ఉండటంతో అధికారులు మిల్లులకు కేటాయించిన ధాన్యాన్ని పరిశీలిస్తున్నారు. గడువులోపు మిల్లుల నుంచి కేటాయింపులకు అనుగుణంగా ధాన్యాన్ని ఎఫ్‌సీఐ పంపేందుకు ప్రయత్నాలను చేస్తున్నారు. ధాన్యం నిల్వలు లేని మిల్లులపై చర్యలు చేపట్టడంతో పాటు కేసులు నమోదు చేసేందుకు కూడా అధికారులు సిద్ధమవుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్నిమిల్లులకు ఎలాంటి గ్యారంటీ లేకుండా ధాన్యాన్ని కేటాయించడంతో నిర్ణీత సమయంలో బియ్యాన్ని ఎఫ్‌సీఐకి అందించేలా ఒత్తిడి చేస్తున్నారు. మిల్లులను 24 గంటలు నడపడంతోపాటు కేటాయించిన ధాన్యాన్ని షెడ్యూల్‌కు అనుగుణంగా కస్టం మిల్లింగ్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే 13 మిల్లులకు నోటీసులు జారీచేసిన అధికారులు సర్కారు నుంచి ఒత్తిళ్లు పెరగడంతో నిత్యం తనిఖీలను చేస్తున్నారు. ప్రతీరోజు ఎఫ్‌సీఐకి 10వేల టన్నుల వరకు బియ్యం పంపేలా ప్రయత్నాలను చేస్తున్నారు.

ధాన్యం సరఫరాపై అధికారుల దృష్టి

జిల్లాలో ప్రతీ సీజన్‌లో భారీఎత్తున ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. సీజన్‌లో కొనుగోలు చేసిన ధాన్యాన్ని జిల్లాలోని మిల్లులకే కేటాయిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మిల్లర్ల అసోసియేషన్ గ్యారంటీపై ధాన్యాన్ని పంపిస్తున్నారు. గతంలో బ్యాంకు గ్యారంటీ లేకుండానే ఈ ధాన్యాన్ని మిల్లులకు కేటాయిస్తున్నారు. జిల్లాలో బాయిల్డ్ రైస్‌మిల్లులు 60 ఉండగా, రార్ రైస్ మిల్లులు 207 ఉన్నాయి. ప్రతీ సీజన్‌లో వీటి కెపాసిటీకి అనుగుణంగా ధాన్యాన్ని కేటాయింపులు చేస్తున్నారు. కస్టం మిల్లింగ్‌కు సమయం ప్రకారం పెట్టే మిల్లులకు ఎక్కువగా ధాన్యాన్ని కేటాయిస్తుండగా మిగతా వాటికి తగ్గిస్తున్నారు. 2022లో జిల్లాలో కేటాయించిన ధాన్యం కస్టం మిల్లింగ్‌తోపాటు 2023 ఖరీఫ్‌లో కేటాయించిన ధాన్యానికి సంబంధించిన బియ్యం సరఫరాపై ప్రస్తుతం అధికారులు దృష్టిపెట్టారు. జిల్లాలోని కొన్ని రైస్‌మిల్లుల్లో కేటాయించిన ధాన్యం ఇతర ప్రాంతాలకు వెళ్తుండగా 3లారీలను కోటగిరి, వర్నికి సంబంధించిన వాటిని సీజ్‌చేశారు. ఆ ధాన్యం ఆధారంగా ఆ మిల్లుల్లో తనిఖీలను నిర్వహించారు. ఇవేకాకుండా ఓ మాజీ ప్రజాప్రతినిధికి సంబంధించిన మిల్లులో కూడా తనిఖీలను చేశారు. కేటాయించిన ధాన్యం మిల్లులో ఉండటంతో త్వరగా కస్టం మిల్లింగ్ చేసి ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చారు. 2022, 2023 ఖరీఫ్‌కు సంబంధించి కస్టం మిల్లింగ్ గడువు గతనెల 31తో ముగియడంతో ఎఫ్‌సీఐ మరోనెల పొడగించింది. ఈనెలాఖరు లోపు టార్గెట్ పూర్తి చేయాలని ఆదేశించింది.

మిల్లులపై చర్యలకు సిద్ధమవుతున్న అధికారులు

జిల్లాలోని రైస్‌మిల్లులతో పాటు రాష్ట్రంలోని రైస్‌మిల్లులకు కేటాయించిన ధాన్యంపై సర్కారు దృష్టిపెట్టింది. సీఎంఆర్‌పై మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి పలు మార్లు సమీక్షించి ధాన్యం పక్కదారి పట్టించిన మిల్లులపై చర్యలు చేపట్టాలని ఆదేశాలిచ్చారు. పూర్తిస్థాయిలో పరిశీలించి నివేదికలు ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చారు. షెడ్యూల్ ప్రకారం కస్టం మిల్లింగ్ కింద ఎఫ్‌సీఐకి బియ్యాన్ని అందించని మిల్లులపై చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. జిల్లాలో మిల్లులకు కేటాయించిన ధాన్యం ఇప్పటివరకు కస్టం మిల్లింగ్ కింద ఎఫ్‌సీఐకి పెట్టిన బియ్యంపై కలెక్టర్ పలు దఫాలు సమీక్షించారు. ఈనెలాఖరులోపు పెట్టని మిల్లులపై చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. గత ప్రభుత్వం ఎలాంటి బ్యాంకు గ్యారెంటీ లేకుండానే మిల్లర్లకు ధాన్యాన్ని కేటాయించింది. రైస్‌మిల్ అసోసియేషన్ ద్వారా లేఖలు తీసుకొని ధాన్యాన్ని కేటాయించింది. జిల్లాలో రూ.100 కోట్ల ధాన్యాన్ని కొనుగోలు చేసి గ్యారంటీ లేకుండానే ఈ మిల్లులకు కేటాయించింది. రాష్ట్రవ్యాప్తంగా ఇదే రీతిలో మిల్లులకు ధాన్యాన్ని కేటాయించడంతో సివిల్ సప్లైకి బకాయిలు భారీగా పేరుకుపోయాయి. మిల్లర్లు కస్టం మిల్లింగ్ కింద బియ్యాన్ని ఎఫ్‌సీఐకి పెట్టకపోవడంతో కొత్త ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి కూడా అధికారులతో సమీక్షలు జరిపి కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

ప్రతీరోజు సమీక్షిస్తున్న అధికారులు

ప్రభుత్వం కేటాయించిన ధాన్యానికి అనుగుణంగా ప్రతీరోజు కస్టం మిల్లింగ్ జరిగేలా అధికారులు ఏర్పాట్లను చేస్తున్నారు. పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవడంతో పాటు ప్రతీరోజు 10వేల టన్నులకు తగ్గకుండా ఎఫ్‌సీఐకి సరఫరా చేసేలా ప్రయత్నాలు చేస్తున్నారు. రాష్ట్రస్థాయిలో ఒత్తిళ్లు పెరగడంతో జిల్లాస్థాయిలో గట్టి ప్రయత్నాలను చేస్తున్నారు. ప్రతీరోజు కస్టం మిల్లింగ్ కింద ఎఫ్‌సీఐకి పెట్టిన బియ్యం వివరాలను కలెక్టర్‌తోపాటు ప్రభుత్వానికి పంపిస్తున్నారు. ప్రభుత్వంతోపాటు అధికారుల నుంచి ఒత్తిళ్లు పెరగడంతో కొన్ని మిల్లులు ముందస్తుగా కస్టంమిల్లింగ్ కింద ధాన్యం అందించేందుకు సిద్ధమవుతున్నాయి.

టార్గెట్ రీచ్‌కాని మిల్లులపై చర్యలు తీసుకోవాలి: ఎమ్మెల్యే

జిల్లాలో వందల కోట్ల రూపాయల విలువైన ధాన్యాన్ని మిల్లులకు కేటాయింపు చేశారు. కొన్ని మిల్లుల్లో ధాన్యాన్ని ఇతర ప్రాంతాలకు మళ్లించారు. మిల్లుల నుంచి ఎఫ్‌సీఐకి కస్టం మిల్లింగ్ కింద ధాన్యాన్ని పెట్టడం లేదు. ధాన్యాన్ని గోల్‌మాల్ చేసిన మిల్లులపై చర్యలు తీసుకోవాలి. మిల్లుల నుంచి బియ్యాన్ని పక్కదారి పట్టించిన వారిపై కేసులు నమోదు చేయడంతోపాటు వసూళ్లు కూడా ప్రభుత్వం చేపడుతుంది.

జిల్లా అంతటా

సంక్రాంతి సందడి



- పల్లెల్లో పండుగ వాతావరణం
- నేడు భోగి

నిజామాబాద్‌అర్బన్, జనవరి 13: భగ భగ మంటలు చలిని తరుమగా గొబ్బెమ్మలు వాకిళ్లను అలంకరించాయి. హరివిల్లు నేలపై వాలగా రంగవల్లులు వాకిళ్లకు కొత్త అందాలను తెచ్చాయి. ఒంటికి రాసిన నువ్వుల నూనె వేడిని పెంచగా రేగుపండ్లు బుడ బుడ స్నానాలను ఆచరించాయి. పిండి వంటలు గుమగుమలాడగా భోగి భగ భాగ్యాలను ఇంట్లోకి చేర్చింది. జిల్లా వ్యాప్తంగా సంక్రాంతి సంబరాలు మొదలయ్యాయి. మూడు రోజుల పాటు నిర్వహించే పండుగ పల్లెల్లో పండుగ వాతావరణం తెచ్చింది. ఆదివారం భోగి, సోమవారం సంక్రాంతి, మంగళవారం కనుమ పండుగలను నిర్వహించనున్నారు. ఉద్యోగులకు, విద్యార్థులకు సెలవులు ప్రకటించడంతో వారంతా సొంత గ్రామాలకు చేరుకున్నారు. కుటుంబ సభ్యులతో ఆనందంగా పండుగను జరుపుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఒకవైపు పిండి వంటలు, మరోవైపు పతంగుల సందడి, కొన్ని చోట్ల కోడి పందాలకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. చిన్నారులు, యువత పతంగులు ఎగరవేస్తూ పండుగను ఉత్సాహంగా జరుపుకుంటున్నారు. మహిళలు నోములు పెట్టేందుకు కొనుగోళ్లకు వస్తుండటంతో మార్కెట్‌లో సందడి వాతావరణం నెలకొంది.

ప్రముఖుల సంక్రాంతి శుభాకాంక్షలు

నిజామాబాద్ అర్బన్, జనవరి 13: జిల్లా ప్రజలకు పలువురు ప్రముఖులు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, రాకేష్ రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త, ఎంపీలు సురేష్‌రెడ్డి, ధర్మపురి అరవింద్, ఎమ్మెల్సీ కవిత, జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, నగర మేయర్ నీతూకిరణ్, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, సీపీ కల్మేశ్వర్, అదనపు కలెక్టర్లు యాది రెడ్డి, చిత్రమిశ్ర, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, బీజేపీ అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. భోగభాగ్యాలను ఇచ్చే భోగి, సరదాలు పంచే సంక్రాంతి వేడుకలు ప్రజలందరికీ మరింత ఆనందం పంచాలని ఆకాంక్షించారు. ఈ నూతన సంవత్సరంలో అన్ని శుభాలే సమకూరాలని అనుకున్న పనులన్నీ నెరవేరాలని ఏడాది పొడవున ఇంటింటా సిరులు కాంతులు విరజిల్లాలని అభిలషించారు.



- నగర ప్రధాన బస్టాండ్

అటకెక్కిన నగర బస్టాండ్ మార్పు

- గతేడాదిలో హడావుడి చేసిన అధికారులు
- శాఖల సమన్వయ లోపంతో బస్టాండ్ మార్పు లేనట్టే



బస్టాండ్ ప్రాంగణం కోసం సర్వే చేసిన స్థలం

సుభాష్‌నగర్, జనవరి13: దశాబ్దాల చరిత్ర గల బస్టాండ్ మారుస్తామని చెప్పిన ప్రభుత్వం, అధికారులు బస్టాండ్ కోసం స్థలం చూసినా శాఖల సమన్వయ లోపంతో బస్టాండ్ మార్పును గాలికి వదిలేశారు. నగర బస్టాండ్‌లో సుమారు వివిధ జిల్లాల నుంచి రోజుకు వందలాది బస్సులు ప్రయాణిస్తుంటాయి. సుమారు లక్ష మంది ప్రయాణికులు ఈ బస్టాండ్ నుంచి ప్రయాణాలు కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం ఈ బస్టాండ్ విస్తీర్ణం చిన్నది కావడంతో బస్టాండ్ మార్పును ఆర్టీసీ యాజమాన్యం స్వాగతించింది. నగరానికి తలమానికంగా ఉన్న నిజామాబాద్ నగర బస్టాండ్ ప్రభుత్వ మెడికల్ కళాశాల, ఆసుపత్రికి స్థలం సరిపోకపోవడంతో ఆసుపత్రి ఉన్నతాధికారులు నగర బస్టాండ్‌ను కావాలని అడగడంతో ఆర్టీసీ యాజమాన్యం సైతం నగర బస్టాండ్‌ను మార్చడానికి ఒప్పుకుంది. 2016లో మొదలైన నగర బస్టాండ్ మార్పు నేటికీ సాగుతూనే ఉంది.

ముందుకు పడని అడుగులు

అధికారులకు గుర్తురాగానే బస్టాండ్ మార్పుపై ఒకమెట్టు కదిలి మళ్లీ గాలికి వదిలేస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి స్థలం ఎంత అవసరమో నగర బస్టాండ్‌కు సైతం పెద్ద మొత్తంలో స్థలం కావాలి. పెరిగిన ప్రయాణికుల రద్దీ దృష్ట్యా పెరిగిన బస్సుల నిలుపుదల కోసం బస్టాండ్‌కు స్థలం అవసరం ఉంది. తగిన ప్లాట్‌ఫామ్‌లు లేకపోవడంతో ఇబ్బందిగా మారింది. దీంతో ఆర్టీసీ యాజమాన్యం సైతం తగినంత స్థలం ఇస్తే బస్టాండ్‌ను ప్రభుత్వ ఆసుపత్రికి ఇవ్వడానికి ఒప్పుకున్నారు. 2016 అనంతరం రైల్వేస్టేషన్ పక్కన గల ఆర్‌అండ్‌బీ స్థలంలో బస్టాండ్ నిర్మాణానికి ఒప్పుకున్నారు. ఆర్టీసీ ఉన్నతాధికారులు సర్వే నిర్వహించారు. స్థలం విషయంలో అంతా పక్కాగా జరిగినా ఎప్పటికప్పుడు బస్టాండ్ మార్పు వెనక్కి వెళ్తోంది. బాజిరెడ్డి గోవర్ధన్ ఆర్టీసీ చైర్మన్ ఎన్నికైన అనంతరం మళ్లీ బస్టాండ్ మార్పు తెరపైకి వచ్చింది. అధికారులతో సమావేశాలు నిర్వహించి బస్టాండ్ మార్పునకు సన్నాహాలు సైతం చేశారు. ఆర్‌ఎంతో సహా ఉన్నతాధికారులు ఆర్‌అండ్‌బీ స్థలాన్ని పరిశీలించారు. బస్టాండ్ మార్పుకు ఆర్టీసీ సైతం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో బస్టాండ్ మార్పు తప్పనిసరి అనుకున్నారు. కానీ బస్టాండ్ మార్పులో ఫుల్‌స్టాప్ పడుతూనే ఉంది.

శాఖల మధ్య సమన్వయ లోపం..

ఆర్టీసీ బస్టాండ్ మార్పు ఆర్టీసీ యాజమాన్యానికి తప్పనిసరికాదు. ఉన్నంతలో వారు సర్దుకుపోతుండగా ప్రభుత్వ మెడికల్ కళాశాల ఆసుపత్రి యాజమాన్యం ప్రభుత్వ పెద్దలతో ఆర్టీసీ యాజమాన్యాన్ని ఒప్పించి స్థలం ఇవ్వాలని కోరింది. ఆర్టీసీ యాజమాన్యం ఒప్పుకోవడంతో ఆర్‌అండ్‌బీ స్థలాన్ని చూపించింది. ప్రభుత్వ మెడికల్ కళాశాల ఆసుపత్రి యాజమాన్యం బస్టాండ్ ప్రాంగణాన్ని ఇస్తున్నందుకు ఆర్టీసీకి కొంత మొత్తంలో చెల్లించాలి. ఆర్‌అండ్‌బీ స్థలం ఆర్టీసీకి ఇస్తున్నందుకు ఆర్టీసీ యాజమాన్యం ఆర్‌అండ్‌బీకి ఇవ్వాలి. ఆర్టీసీ బస్టాండ్ మార్పు తమకు అవసరం లేకపోవడంతో ప్రభుత్వ మెడికల్ కళాశాల యాజమాన్యం ఆర్‌అండ్‌బీకి డబ్బులు చెల్లించాలి. ఆర్‌అండ్‌బీ అధికారులు డబ్బులు చెల్లించాలని అడగడంతో బస్టాండ్ మార్పు జరగడం లేదు. ఇప్పటికే నూతన బస్టాండ్ నిర్మాణానికి అంచనా వ్యయం రోజురోజుకూ పెరిగిపోతుండటంతో ఆసుపత్రికి సంబంధించి యాజమాన్యం అంత మొత్తంలో డబ్బులు చెల్లిస్తారా అని సందిగ్ధంలో పడింది. ప్రస్తుతం ఆర్‌అండ్‌బీ స్థలం, ముందు స్థలంలో ప్రభుత్వ స్థలాలే ఉండటంతో నగర ప్రధాన బస్టాండ్ అక్కడికి వస్తే అందరికీ ఆమోదయోగ్యంగా ఉంటుందని భావిస్తున్నారు. ప్రస్తుత బస్టాండ్ సైతం ఇరుకుగా ఉండటంతో నూతనంగా ఆధునీకరించి నిర్మిస్తే రానున్న సంవత్సరాలకు ఉపయోగకరంగా ఉంటుందని ప్రయాణికులు భావిస్తున్నారు. నగర బస్టాండ్ నిర్మాణాన్ని కొలిక్కి తేవాలని ప్రజలు కోరుతున్నారు.



బోధన్ ఏరియా ఆసుపత్రి



వసతులు ఫుల్.. సేవలు నిల్!

- బోధన్ ప్రభుత్వ ఆస్పత్రిలో సిబ్బంది కరువు
- సిబ్బంది లేక నిలిచిన స్కానింగ్ సేవలు
- ప్రైవేటు సెంటర్లకు వెళ్తున్న గర్భిణులు, చిన్నారులు
- నెలల తరబడి కొనసాగుతున్న అభివృద్ధి పనులు
- ఆస్పత్రి నిర్వహణను పర్యవేక్షించని ఉన్నతాధికారులు



ఆసుపత్రిలో నిరుపయోగంగా స్కానింగ్ యంత్రం

బోధన్‌రూరల్, జనవరి 13: బోధన్ ప్రభుత్వ ఆసుపత్రిలో సిబ్బంది కొరత వేధిస్తోంది. ఆసుపత్రిలో అన్ని వసతులు ఉన్నా వైద్య పరీక్షలు చేసే సిబ్బంది లేక గర్భిణీలు, చిన్నారులకు అవస్థలు తప్పడం లేదు. స్కానింగ్‌చేసేందుకు అన్నిపరికరాలు ఉన్నా రేడియాలిజిస్టులు లేక గర్భిణీలకు తిప్పలు తప్పడం లేదు. స్కానింగ్ తప్పనిసరి కావడంతో గర్భిణీలు ప్రైవేటు సెంటర్లకు పరుగులు పెడుతున్నారు. ఆస్పత్రి నిర్వహణను ఉన్నత అధికారులు పట్టించుకోకపోవడంతో పరిస్థితి అధ్వానంగా తయారైంది.

నిలిచిన స్కానింగ్ సేవలు

బోధన్ ప్రభుత్వ ఆసుప్రతిలో సరిపడా సిబ్బంది లేక ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారు. గర్భస్థ శిశువు ఆరోగ్య పరిస్థితి తెలుసుకోడానికి అవసరమయ్యే యంత్రపరికరాలు ఆసుపత్రిలో ఉన్నాయి. ఆసుపత్రులకు స్కానింగ్ యంత్రాలను సమకూర్చిన గత ప్రభుత్వం వాటిని నడిపించే రేడియాలజిస్టులను నియమించలేదు. దీంతో స్కానింగ్ సేవలు నిలిచిపోయాయి. ఫలితంగా గర్భిణీలు స్కానింగ్ కోసం ప్రైవేట్ సెంటర్లకు వెళ్తున్న పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ, శస్త్ర చికిత్సల ద్వారా ప్రసవ సేవలను అందించడంలో భాగంగా గర్భిణీలకు అవసరమైన స్కానింగ్ చేయడానికి ప్రభుత్వం గతంలో స్కానింగ్ యంత్రాలను కేటాయించింది. ఆసుపత్రిలో స్కానింగ్ యంత్రాలున్నా రేడియాలజిస్టులు లేక అవి వృథాగా మారాయి. మహిళలు గర్భం దాల్చిన నాటి నుంచి ప్రసవించే వరకు మూడు, నాలుగు మార్లు స్కానింగ్ చేయించుకోవాల్సి ఉంటుంది. ఒక్కో స్కానింగ్‌కు మార్కెట్‌లో రూ.2వేలకు పైగానే వసూలు చేస్తున్నారు. దీంతో ఆసుప్రతికి వచ్చే గర్భిణులు స్కానింగ్‌కు చేసుకునేందుకు ఇబ్బందులకు గురవుతున్నారు. ఆసుప్రతిపై ఉన్నత అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. గత ప్రభుత్వం గర్భిణీలు ప్రభుత్వ ఆసుపత్రులలోనే ప్రసవం చేసుకోవాలని అనేక కార్యక్రమాలు నిర్వహించింది. గర్భిణీలు పౌష్టికాహారం కోసం న్యూట్రిషన్ కిట్లు, ప్రసవించిన తర్వాత కిట్‌లను అందజేశారు. అలాగే వేల ఖర్చుతో కూడుకున్న స్కానింగ్ యంత్రాలను కొనుగోలు చేసినా రేడియాలజిస్టుల పోస్టులను భర్తీ చేయకపోవడంతో పలువురు పెదవివిరుస్తున్నారు.

నిరుపయోగంగా ఆధునాతన యంత్రాలు

ప్రభుత్వ ఆసుపత్రిలో చిన్నపిల్లల ఐసీయూ విభాగంలో ఆధునాతన యంత్రాలు ఉన్నా పూర్తిస్థాయి వైద్యుల బృందం లేక చిన్నారుల తల్లిదండ్రులు అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఐసీయూ విభాగం అన్ని హంగులతో పూర్తి చేసినా సిబ్బంది లేక ఆధునాతన యంత్రాలు నిరుపయోగంగా మారాయి. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి బోధన్ ప్రభుత్వ ఆసుపత్రిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని ప్రజలు కోరుతున్నారు.

నెలల తరబడి కొనసాగుతున్న పనులు

బోధన్ ఆసుపత్రిలోని ప్రసూతి విభాగంలో చేపడుతున్న అభివృద్ధి పనులు నెలల తరబడిగా కొనసాగుతున్నాయి. గత వర్షాకాలంలో పైపెచ్చులూడి పడటంతో ప్రసూతి విభాగాన్ని ఆస్పత్రి ప్రాంగణంలోనే మరో విభాగంలో కాన్పులు చేస్తున్నారు. నెలలతరబడి పనులు జరగడంతో ఆసుపత్రికి వచ్చేవారు ఇంకెన్నాళ్లంటూ ప్రశ్నిస్తున్నారు.

పోస్టింగ్ బోధన్‌లో.. వర్కింగ్ మరోచోట..

బోధన్ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రముఖ విభాగాల్లో ఉన్న చిన్నపిల్లల వైద్యులు, అర్థోపెడిక్, పాథలాజికలిస్టు, మత్తు డాక్టర్‌లకు ఇక్కడ పోస్టింగ్ ఉన్నప్పటికీ మరో చోట డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారు. వైద్యులందరీ సేవలు అనుకున్నట్లు రోగులకు అందితే ఇబ్బంది ఉండదు. పూర్తిస్థాయి సిబ్బందిని నియమించి ఉన్నతాధికారుల అజామాయిషీ ఉండాలని ప్రజలు కోరుతున్నారు.

ఆసుపత్రి నిర్వహణపై దృష్టి పెట్టాలి..

గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను కాంగ్రెస్ ప్రభుత్వం సరిదిద్ది ఆసుపత్రుల్లో అవసరమైన రేడియాలజిస్టు పోస్టులతోపాటు పూర్తిస్థాయి వైద్య సిబ్బందిని భర్తీ చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఆసుపత్రులలో పూర్తిస్థాయి వైద్యసిబ్బందిని నియమించి అందరికీ ఆరోగ్యం అందేలా చూడాలని కోరుతున్నారు.



ఆసుపత్రిలో కొనసాగుతున్న పనులు

మట్కా కేసులో బీఆర్‌ఎస్ యువ నేతపై కేసు నమోదు

ఖిల్లా, జనవరి 13: జిల్లాలో సంచలనం సృష్టించిన మట్కా కేసులో బీఆర్ ఎస్ పార్టీకి చెందిన యువ నేత ఇమ్రాన్ షహజాద్‌తో పాటు మరో 16 మందిపై నగరంలోని ఐదోటౌన్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు నార్త్ రూరల్ ఇన్స్‌పెక్టర్ సతీష్ తెలిపారు. బీఆర్ఎస్ పార్టీలో కీలంగా వ్యవహరించిన మైనారిటీ నేత మట్కా నిర్వాహణలో భాగస్వామ్యం ఉందనే పక్కా సమాచారంతో పోలీసుల విచారణలో తేలడంతో ఆయనపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇమ్రాన్ షహజాద్‌తో పాటు మహారాష్ట్రకు చెందిన నీలేష్, నగరానికి చెందిన ఇర్ఫాన్, ఫైమద్, జాన్కంపేట్‌కు చెందిన గులామ్, వర్నికి చెందిన మీనాజ్, అభిజిత్, నాందేడ్‌కు చెందిన చందు, ఉమర్‌ఖేడ్‌కు చెందిన సంజీవ్, బీడ్‌కు చెందిన వసీం, ఉమ్రికి చెందిన మహబూబ్, బిలోలికి చెందిన సాజిద్, అకోలకు చెందిన అన్సార్, అమరావతికి చెందిన పటేల్, నౌషాద్, గుడ్డు, ముబీన్‌లు ఉన్నట్లు సీఐ తెలిపారు. ప్రస్తుతం వీరు పరారీలో ఉన్నారని వీరి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

డివైడర్లు ఏర్పాటు చేయాలని ఆందోళన

ఖిల్లా, జనవరి 13 : నగర శివారులోని నెహ్రూనగర్ సమీపంలో రోడ్డుకు మధ్యలో డివైడర్లు ఏర్పాటు చేయాలని స్థానికులు ఆందోళనకు దిగారు. శుక్రవారం రాత్రి నెహ్రూనగర్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందిన ఘటనపై స్థానికులు ఆందోళనకు దిగారు. కొద్ది సేపు రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా డివైడర్లు లేనందున తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపించారు. వెంటనే పోలీసుశాఖ స్పందించి డివైడర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళన చేస్తున్న విషయాన్ని తెలుసుకున్న ట్రాఫిక్ సీఐ నారాయణ, సౌత్ రూరల్ ఇన్స్‌పెక్టర్ వెంకటనారాయణ, 6వ టౌన్ ఎస్సై మొగులయ్య సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకొని ఆందోళన కారులను శాంతింపజేశారు. సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

అక్రమంగా తరలిస్తున్న టిప్పర్లు సీజ్

మోపాల్, జనవరి 13: మోపాల్ మండలంలోని ఒడ్డెర కాలనీ ప్రాంతం నుండి అక్రమంగా మొరాన్ని నిజామాబాద్‌కు తరలిస్తున్న టిప్పర్లను శనివారం రాత్రి టాస్క్‌ఫోర్స్ అధికారులు దాటి చేసి ముగ్గురిని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. గత కొన్ని రోజుల నుంచి మొరాన్ని గుట్టుచప్పుడు కాకుండా కొందరు తరలిస్తున్నట్లు పోలీసు ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడంతో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ రాజశేఖర్‌రాజు, సీఐలు అంజయ్య, అజయ్‌బాబు, సిబ్బంది ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఎలాంటి వేబిల్లులు లేకుండా మొరాన్ని తరలిస్తున్నారన్నారు. ఒక ఖాళీ టిప్పరు, రెండు మొరం టిప్పర్లను సీజ్ చేసి ముగ్గురిని అరెస్టు చేసినట్లు తెలిపారు.

జెడ్పీటీసీ నిధులతో బోరుబావి తవ్వకం

ఇందల్వాయి, జనవరి 13: ఇందల్వాయి మండలంలోని గన్నారం గ్రామంలో మహిళా భవనం వద్ద జెడ్పీటీసీ సుమనరెడ్డి నిధులతో బోరుబావి తవ్వించడం జరిగిందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చిలివేరి దాస్ తెలిపారు. మహిళా భవనం వద్ద నీటి సౌకర్యం లేకపోవడంతో జెడ్పీటీసీ దృష్టికి తీసుకెళ్లామని ఆమె 15వ ఫైనాన్స్ నిధులు కేటాయించడంతో శనివారం బోరు వేయించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ లావణ్య రవి, జాగృతి అధ్యక్షుడు గంగాధర్, కుంట గంగారెడ్డి, రాంరెడ్డి, రాజేష్, వెంకట్ తదితరులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్

పరిశీలికురాలుగా ఫిజికల్ డైరెక్టర్ నీరజారెడ్డి

డిచ్‌పల్లి, జనవరి 13: ఈ నెల 12నుంచి 14వరకు సిద్దిపేట జిల్లా సాంఘీక సంక్షేమ పాఠశాల కొండపాక క్రీడ మైదానంలో జరుగుతున్న 67వ స్కూల్ గేమ్స్ రాష్ట్ర అండర్-19 సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్ జరగనున్నాయి. రాష్ట్ర పరిశీలకురాలుగా ధర్మారం(బి) సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల ఫిజికల్ డైరెక్టర్ నీరాజరెడ్డి వ్యవహరిస్తున్నట్లు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి గంగాధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తనకు ఈ అవకాశం వచ్చినందుకు నీరజారెడ్డి సంతోషం వ్యక్తం చేశారు.

సెట్విన్ ఆధ్వర్యంలో కంప్యూటర్ శిక్షణకు ఆహ్వానం

డిచ్‌పల్లి, జనవరి 13: నిరుద్యోగ యువతీయువకులకు తెలంగాణ యువజన శాఖ సెట్విన్ ఆధ్వర్యంలో కంప్యూటర్, మరియు టైలరింగ్ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ ప్రతినిధి అబ్రారర్‌ఖాన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ కావల్సిన వారు ఘన్‌పూర్ గ్రామ పంచాయతీ మొదటి అంతస్థులోని కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ఆర్మూర్‌లో బసవన్న విన్యాసాలు

ఆర్మూర్‌టౌన్ , జనవరి13: ఆర్మూర్ పట్టణంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి వేడుకలలో భాగంగా వాడవాడలలో ప్రతీ ఇంటి ముందు మహిళలు ముగ్గులు వేయగా బసవన్న ప్రత్యేక ఆకర్షణ ఉంటు విన్యాసాలు చేయడంతో పలువురిని ఆకట్టుకున్నాయి. దీంతో బసవన్నకు సాంప్రదాయంగా బియ్యం, పండ్లు అందజేసి పలువురు మహిళలు ఆశీర్వచనాలు తీసుకున్నారు.

భార్య ఆత్మహత్య..? భర్త హత్య..?

- అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి
- ఆమె బంధువుల దాడి.. చనిపోయిన భర్త
- అచ్చంపేటలో దారుణం.. ఇరు కుటుంబాల్లో విషాదం


సింధు, నాగార్జున (ఫైల్)

అచ్చంపేట, జనవరి 13 : అనుమానాస్పద స్థితిలో ఓ వివాహిత చనిపోయింది. కుటుంబ కలహాలు, వరకట్న, లైంగిక వేధింపుల ఆరోపణలు ఆమె మరణం చుట్టూ అలుముకున్నాయి. కట్టుకున్నోడి వల్లనే తమ బిడ్డ చనిపోయిందని ఆగ్రహించిన యువతి బంధువులు ఆమె భర్తపై దాడి చేశారు. దెబ్బల తీవ్రతనో.. మరే కారణమో తెలియదు కానీ.. అతడు చనిపోయాడు. దీంతో ఇరు కుటుంబాల్లో విషాదం నిండింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటకు చెందిన సింధు(26)కు పట్టణంలోని శ్రీరాం(నరిరాం) ఆస్పత్రిలో పని చేస్తున్న ఖమ్మం జిల్లాకు చెందిన నాగార్జునతో పరిచయం ఏర్పడి, ప్రేమగా మారింది. మూడేళ్ల క్రితం వీరు హైదరాబాద్‌లోని ఆర్య సమాజ్‌లో పెళ్లి చేసుకున్నారు. కొంత కాలం అక్కడే ఉండి తర్వాత అచ్చంపేటకు వచ్చి శ్రీరాం ఆస్పత్రిలో పని చేస్తున్నారు. ఏడాది క్రితం దంపతుల మధ్య గొడవలు జరగడంతో సింధు.. బిజినేపల్లిలోని అమ్మమ్మ గారి ఇంటికి వెళ్లిపోయింది. నాగార్జున పోలీసులను ఆశ్రయించడంతో ఆమె తిరిగి వచ్చింది. ఆర్థిక పరిస్థితులు బాగాలేకపోవడం, డబ్బు కోసం భర్త వేధింపుల నేపథ్యంలో ఇరువురి మధ్య మళ్లీ గొడవలు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి సింధు ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. కొన ఊపిరితో ఉన్న ఆమెకు భర్త నాగార్జున.. శ్రీరాం ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించాడు. పరిస్థితి విషమంగా ఉండటంతో అంబులెన్స్‌లో హైదరాబాద్‌కు తరలిస్తుండగా సింధు చనిపోయింది. ఈ విషయాన్ని నాగార్జున.. సింధు కుటుంబ సభ్యులకు తెలిపాడు. దీంతో ఆమె బంధువులు ఒక వాహనంలో అంబులెన్స్ వద్దకు చేరుకున్నారు. నాగార్జునను తమ వాహనంలో ఎక్కించుకొని తీవ్రంగా దాడి చేశారు. దెబ్బల తీవ్రతనో.. మరే కారణమో తెలియదు గానీ.. నాగార్జున చనిపోయాడు. అతడిని కొట్టి చంపేశారని నాగార్జున తల్లి, చెల్లెలు ఆరోపిస్తున్నారు. కాగా, తమ కూతురిని చంపి, ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని సింధు తండ్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. నాగార్జున, డాక్టర్ కృష్ణ, అతడి భార్య హైమావతి ఇదంతా చేశారని చెప్పారు. డాక్టర్ కృష్ణ తమ కూతురిని పలుమార్లు లైంగికంగా వేధించాడని తెలిపారు. నాగార్జున మృతిపై అతడి కుటుంబీకులు కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నీటి బకెట్‌లో పడి చిన్నారి మృతి

కొత్తూర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఓ 16 నెలల చిన్నారి ఆడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తు నీటి బకెట్‌లో పడి మృతిచెందింది. ఈ విషాదకర ఘటన రంగారెడ్డి జిల్లా కొత్తూర్‌లో శనివారం జరిగింది. బిహార్‌కు చెందిన ధర్మేందర్ దంపతులు కొత్తూర్ నారాయణగూడ కాలనీలో నివాసం ఉంటున్నారు. వారికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఓ వస్త్ర దుకాణంలో పనిచేస్తున్న ధర్మేందర్ శనివారం పనికి వెళ్లాడు. అతని భార్య ఇంటి పనుల్లో నిమగ్నమై ఉండగా పెద్ద కుమార్తె రియా (16 నెలల) ఆడుకుంటూ వెళ్లి బాత్‌రూంలోని నీటి బకెట్‌లో పడిపోయింది. నీటి బకెట్‌లో చిన్నారి మృతి చెంది కనిపించడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

అప్పులు తీర్చలేక యువ రైతు ఆత్మహత్య

ఖానాపూర్, జనవరి 13 : పత్తి పంట దిగుబడి రాకపోవడం, అప్పులు పెరిగిపోవడంతో జీవితంపై విరక్తి చెందిన ఓ యువ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం చందునాయక్ తండాకు చెందిన గుగ్లావత్ శ్రీకాంత్ (26) రెండు ఎకరాల్లో పత్తి వేశాడు. ఈ సారి ఆశించినంత దిగుబడి రాలేదు. దీనికి తోడు తన అక్క పెళ్లి కోసం చేసిన రూ.3 లక్షల అప్పు ఎలా తీర్చాలో తెలియక నిత్యం మథన పడేవాడు. ఈ క్రమంలోనే శనివారం రాత్రి పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.

బస్సు మంటల్లో మసైపోయి..

గద్వాల జిల్లా బీచుపల్లి వద్ద ప్రైవేటు బస్సు బోల్తా.. చెలరేగిన మంటలు.. మహిళ సజీవ దహనం


మంటల్లో పూర్తిగా కాలిపోయిన బస్సు, ఇన్‌సెట్లో.. మాలతి(ఫైల్)

గద్వాల, గద్వాల క్రైం /ఎర్రవల్లి, నార్సింగ్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): బోల్తాపడ్డ ఆ బస్సుకు అంటుకున్న మంటలు పెద్దవి కాకమునుపే ప్రయాణికుల్లో కొందరు ఎలాగో అలా బయటపడ్డారు. చాలామందిని స్థానికులే రక్షించారు. ఒక్క మహిళ మాత్రం ఆ బస్సులోనే ఉండిపోయింది. రాకాసి మంటలు కోరలు చాస్తూ బస్సు అంతటా వ్యాపించాయి. ఆ మంటల్లో ఆమె కాలిబూడిదై పోయింది. ఈ హృదయవిదారక ఘటన గద్వాల జిల్లాలో జరిగింది. హైదరాబాద్ నుంచి చిత్తూరు వెళ్తున్న ఓ ప్రైవేటు బస్సు శనివారం తెల్లవారు జామున బీచుపల్లి-ఎర్రవల్లి మధ్య బోల్తా పడింది. ఆ వెంటనే బస్సు ముందు భాగంలో మంటలంటున్నాయి. మృతురాలిని ఏపీలోని చిత్తూరు జిల్లాకు చెందిన మాలతి (45)గా గుర్తించారు. పోలీసుల వివరాల ప్రకారం.. శుక్రవారం రాత్రి 11 గంటలకు ఓ ప్రైవేటు బస్సు హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి నుంచి చిత్తూరుకు బయలుదేరింది. బస్సుల్లో 42 మంది ప్రయాణికులు, ఇద్దరు డ్రైవర్లు ఉన్నారు. హైదరాబాద్ నుంచి జడ్చర్ల దాబా దాకా ఒక డ్రైవర్ బస్సు నడిపాడు. తర్వాత ఒంటి గంట సమయంలో స్టీరింగ్ రెండో డ్రైవర్ తీసుకున్నాడు. బీచుపల్లి దాటిన తర్వాత, పదవ బెటాలియన్ సమీపంలో తెల్లవారుజామున 2.30 గంటలకు బస్సు అదుపు తప్పి బోల్తా పడింది. షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. ప్రయాణికులు ప్రాణభయంతో కేకలు వేశారు. పక్కనే ఉన్న హార్వెస్టర్ గ్యారేజీ కార్మికులు, పెట్రోల్ బంక్ వర్కర్లు హుటాహుటిన స్పందించారు. బస్సు అద్దాలను పగులగొట్టి ప్రయాణికులను కాపాడారు. పోలీసులు కూడా సహాయక చర్యలు చేపట్టారు.ఆ వెంటనే బస్సులో మంటలు చెలరేగాయి. మంటల్లో మాలతి అనే ప్రయాణికురాలు చిక్కుకుపోయారు. ఆమె చెయ్యి బస్సు సీటు సందులో ఇరుక్కుపోవడంతో తప్పించుకునేందుకు వీల్లేకపోయినట్లు తెలుస్తోంది. కాపాడండి అంటూ ఆమె ఆర్తనాదాలు చేస్తున్నా, అప్పటికే మంటలు తీవ్రం కావడంతో ఎవరూ ఆమెను రక్షించే సాహసం చేయలేకపోయారు. అందరి కళ్ల ముందే ఆమె సజీవ దహనమయ్యారు. మాలతిది చిత్తూరు జిల్లా పెనుమూరు మండలం, పుత్తమర్ల గ్రామం. ఆమె హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని రైస్ రీసెర్చ్ సెంటర్‌లో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్నారు. భర్త శ్రీనివాస్ కూడా హైదరాబాద్‌లోనే వ్యాపారం చేస్తుండటంతో ఆ కుటుంబం నగరంలోని లంగర్‌హౌజ్‌లో ఉంటోంది. భర్త శ్రీనివాస్ తల్లి అనారోగ్యానికి గురవ్వడంతో రెండ్రోజుల క్రితం ఆమె చిత్తూరుకు వెళ్లిపోయారు. మాలతి కూడా శుక్రవారం రాత్రి బస్సులో సొంతూరుకు ప్రయాణమయ్యారు. తెల్లవారుజామున మూడు గంటల సమయంలో ఘటన జరగ్గా, ఉదయం ఏడు గంటల దాకా మాలతి మృతదేహం కాలుతూనే ఉంది.. తన కళ్ల ముందే మాలతి మంటల్లో సజీవదహనమైందని గద్వాల వాస్తవ్యుడు కలీం అనే ప్రత్యక్ష సాక్షి చెప్పారు. హైదరాబాద్ నుంచి ఊరికి వెళుతుండగా బస్సుకు మంటలంటుకోవడాన్ని గమనించి అక్కడికి వెళ్లానని ఆయన చెప్పారు. కాగా డ్రైవర్ నిద్రమత్తే బస్సు ప్రమాదానికి కారణం అని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. 36 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఆరుగురు ప్రయాణికులు, ఒక డ్రైవర్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ఘటన స్థలంలోనే మాలతి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. గద్వాల, అలంపూర్ ఎమ్మెల్యేలు కృష్ణమోహన్‌రెడ్డి, విజయుడు ఘటనాస్థలికి వెళ్లారు.

గతంలోనూ ఇదే తరహా ఘటనలు

ఉమ్మడి పాలమూరు జిల్లా పరిధిలో గతంలోనూ ఇలాంటి ప్రమాదాలు జరిగాయి. 2002 సెప్టెంబరు 5న గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం కోదండాపురం వద్ద హైదరాబాద్ నుంచి కడప జిల్లా రాయచోటికి వెళ్తున్న ఆర్టీసీ బస్సులో మంటలు చెలరేగాయి. ఈ బస్సులో ప్రయాణిస్తున్న 31 మందిలో 13 మంది చనిపోయారు. మరో 18 మందికి తీవ్రగాయాలయ్యాయి. 2013 అక్టోబరు 30న బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న జబ్బార్ ట్రావెల్స్‌కు చెందిన వాల్వో బస్సు కొత్తకోట మండలం పాలెం వద్ద కల్వర్టుకు ఢీకొని రాసుకపోవడంతో మంటలు చేలరేగి బస్సుకు మంటలంటుకున్నాయి.. ఈ ఘోర దుర్ఘటనలో 45 మంది సజీవదహనం అయ్యారు.

గుంతలోకి 3 వాహనాలు.. తల్లి, కొడుకు దుర్మరణం!

- ముందు వెళుతున్న ఆటోను ఢీకొట్టిన కారు
- అదుపుతప్పి ముందు వెళుతున్న బైక్‌ను ఢీకొన్న ఆటో
- 3 వాహనాలూ గుంతలోకి.. కారులోని తల్లి, కుమారుడి మృతి

శంషాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఒక వాహనం అదుపు తప్పడం.. ఆ వాహనంతో పాటు మరో రెండు వాహనాలను ప్రమాదం బారిన పడేసింది! మూడు వాహనాలూ రోడ్డు పక్కన ఓ గుంతలో పడ్డాయి. ప్రమాదానికి గురైనవి కారు, ఆటో, బైక్! ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న తల్లి, కొడుకు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందారు. ఆటోలో ప్రయాణిస్తున్న వారిలో ఒకరు, బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు గాయపడ్డారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం ఘాంసిమియాగూడ వద్ద ఈ ప్రమాదం సంభవించింది. శంషాబాద్ రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. కాప్రా మునిసిపాలిటీ శ్రీరాంనగర్‌కు చెందిన బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ సైంటిఫిక్ ఆఫీసర్ మెరువ ఆదిశేషారెడ్డి(57), తల్లి రాములమ్మ(88)తో కలసి కారులో హైదరాబాద్ నుంచి నంద్యాలకు వెళుతున్నారు. ఘాంసిమియాగూడ వద్దకు రాగానే కారు అదుపుతప్పి ముందు వెళుతున్న ఆటోను ఢీకొట్టింది. ఫలితంగా ఆటో అదుపుతప్పి దాని ముందు వెళుతున్న బైక్‌ను ఢీకొంది. ఫలితంగా మూడు వాహనాలు ఒకదాని వెంట మరొకటి హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారి విస్తరణ పనుల కోసం నిర్మించిన కల్వర్టులో బోల్తాపడ్డాయి. ప్రమాదంలో కారులో ఉన్న ఆదిశేషారెడ్డి, రాములమ్మ అక్కడికక్కడే మృతిచెందారు. బైక్‌పై ఉన్న గొల్ల ఆంజనేయులు, వెనుక కూర్చున్న పద్నాలుగేళ్ల బాలిక, ఆటోడ్రైవర్ రాయన్నగూడ సిద్ధయ్య గాయపడ్డారు. ఆటోలో ఉన్న మరో ఇద్దరు రోడ్డుపక్కనే పడిపోగా వారికి ఎలాంటి గాయాలు కాలేదు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని తల్లీకుమారుల మృతదేహాలను కల్వర్టు నీటిలో నుంచి బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

పండుగ సరుకుల కోసం వచ్చి..

పరలోకాలకు!

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

చేర్యాల, జనవరి 13: సంక్రాంతి పండుగకు సరుకులు కొనేందుకు బయటికి వచ్చిన మహిళ రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. కాటర్‌పిల్లర్ మెషీన్ ఆపరేటర్ నిర్లక్ష్యంగా వాహనాన్ని నడపడంతోనే ఈ ప్రమాదం చోటుచేసుకుంది. సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం దొమ్మాట గ్రామానికి చెందిన చల్లా లక్ష్మి(39) శనివారం చేర్యాలకు పండుగ కోసం సరుకులు కొనేందుకు వచ్చింది. తర్వాత ఇంటికి వెళ్లేందుకు చూస్తుండగా తమ ఇంటి సమీపంలోని బంధువు కనకారెడ్డి కలిసి టీవీఎస్ ఎక్సెల్‌పై దొమ్మాటకు వెళ్తూ ఎక్కించుకున్నాడు. ఇటు జనగామ-సిద్దిపేట ప్రధాన రహదారి విస్తరణ పనుల్లో భాగంగా పట్టణ శివారులో కల్వర్టు నిర్మాణం జరుగుతోంది. అక్కడ చెవులకు ఇయర్ ఫోన్స్ పెట్టుకొని కాటర్ పిల్లర్ మెషీన్‌తో ఆపరేటర్ నిర్లక్ష్యంగా కంకర మిశ్రమాన్ని చదును చేస్తూ వెనక వైపునకు తోలుతున్నాడు. ఇంతలో వెనక నుంచి వస్తున్న కనకారెడ్డి బండి అదుపు తప్పడంతో ఇద్దరూ కిందపడిపోయారు. అది గమనించని ఆపరేటర్ మెషీన్‌ను లక్ష్మి పైనుంచి తీయడంతో ఆమె మృతి చెందింది. కనకారెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. కాగా, కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని మృతురాలి కుటుంబీకులు, బంధువులు చేర్యాల పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. జనగామ-సిద్దిపేట రహదారిపై బైఠాయించారు.

పతంగి ఎగురవేస్తుండగా

విద్యుత్తు షాక్

- అత్తాపూర్‌లో 11 ఏళ్ల బాలుడి దుర్మరణం
- రైలు పట్టాలపై పడిన గాలి పటం
- నవాంద్గి స్టేషన్‌లో రైలు ఢీకొని బాలుడి మృతి

రాజేంద్రనగర్/బషీరాబాద్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): భవనంపై ఉన్న ఏసీ కాపర్ పైప్‌లైన్‌ను విద్యుత్ ప్రసారం జరిగి.. కరెంటు షాక్‌తో ఓ బాలుడు చనిపోయాడు. రాజేంద్రనగర్‌లో ఈ ఘోరం జరిగింది. అత్తాపూర్ రాంబాగ్ మల్లయ్య టవర్స్ సమీపంలో మహారాష్ట్రకు చెందిన అభిషేక్ కుటుంబం ఉంటోంది. అభిషేక్ సోదరుడు మూడేళ్ల క్రితం చనిపోయాడు. అభిషేక్ వదిన చాలారోజుల క్రితం ఎటో వెళ్లిపోయింది. దీంతో వారి కుమారుడు తనిష్క్(11) పెదనాన్న అభిషేక్ వద్దే ఉంటున్నాడు. సంక్రాంతి సందర్భంగా అభిషేక్ కుమారుడు మోహిత్ పతంగి ఎగురవేసేందుకు మల్లయ్య టవర్స్ ముందు ఉన్న లక్ష్మీవాణి టవర్స్ పైకి వెళ్లాడు. అతడితో తనిష్క్ కూడా వెళ్లాడు. లక్ష్మీవాణి అపార్ట్‌మెంట్స్ పెంట్‌హౌస్‌పై ఇద్దరూ పతంగి ఎగురవేస్తుండగా అక్కడ ఏసీ ఔట్‌పుట్ కాపర్ పైప్‌లైన్‌కు తనిష్క్ తగిలాడు. దానికి అప్పటికే విద్యుత్తు ప్రసారం జరగడంతో షాక్‌తో చనిపోయాడు. గాలిపటం కోసం పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని బాలుడు చనిపోయాడు. వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం నవాంద్గి రైల్వేస్టేషన్ సమీపంలో శనివారం ఈ ప్రమాదం జరిగింది. బషీరాబాద్ మైనారిటీ కాలనీకి చెందిన అస్లామ్ కుమారుడు అబుజార్(9) గాలిపటం ఎగరేస్తున్నాడు. అది తెగి ఇంటి సమీపంలోనే ఉన్న రైలు పట్టాలపై పడటంతో పతంగి తీసుకునేందుకు బాలుడు పరుగు తీశాడు. అప్పటికే స్టేషన్‌లో గూడ్స్ రైలు ఆగి ఉండటంతో దాని కింది నుంచి దూరి అటువైపు వెళ్తుండగా మరో ట్రాక్‌పై వస్తున్న రైలు ఢీకొట్టింది.

తెలంగాణాలో వచ్చే ప్రభుత్వం మాదే: ఎంపీ అర్వింద్


తిరుమలలో మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్

తిరుమల, జనవరి13(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో తర్వాత ప్రభుత్వం బీజేపీదే అని ఆ పార్టీ ఎంపీ ధర్మపురి అరవింద్ ధీమా వ్యక్తం చేశారు. శనివారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో డబుల్ డిజిట్‌లో ఎంపీ స్థానాలు బీజేపీకి వస్తాయని అలాగే నరేంద్రమోదీ మళ్లీ ప్రధాని అవుతారన్నారు.500 ఏళ్ల తర్వాత శ్రీరాముల వారు తాను పుట్టిన స్థలానికి వస్తున్నారన్నారు. కులాలు, మతాలకు అతీతంగా శ్రీరామనామ స్మరణతో స్వాగతం పలుకుదామన్నారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కోటగిరి,జనవరి13: దేశ ప్రజల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో మనోహర్ రెడ్డి సూచించారు. పొతంగల్ మండల కేంద్రంలో శనివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ సాబ్ కా సాత్ సాబ్ కా వికాస్ నినాదంతో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. నవ భారత నిర్మాణంలో అమృత కాలం విశిష్టత, వికసిత్ భారత్ సంకల్పయాత్ర ఔన్నత్యంపై ప్రధాని సందేశాన్ని వినిపించి ప్రతిజ్ఞ చేశారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో బీపీ, షుగర్స్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వర్ని శంకర్, ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, హెల్త్ సూపర్‌వైజర్లు సాయి కుమారి, ఆరోగ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ధర్పల్లిలో..

ధర్పల్లి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎండీవో లక్ష్మణ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. యువకులు, మహిళలు రైతుల కోసం పథకాలు ఉన్నాయని వీటన్నింటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో ఎంపీవో రాజేష్, ఈవో సైఫొద్దీన్, కర్క గంగారెడ్డి, శేఖర్, నజీర్, తదితరులు ఉన్నారు.

ఇందల్వాయిలో..

ఇందల్వాయి: కేంద్ర ప్రభుత్వ నిధులను వంద శాతం సద్వినియోగం చేసుకోవాలని మండల అధికారులు అన్నారు. శనివారం ఇందల్వాయి మండలంలోని చంద్రయాన్‌పల్లి గ్రామంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. తెల్లరేషన్ కార్డు కలిగి ఉన్న వారు కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎల్‌పీజీ గ్యాస్, పీఎం కిసాన్, ఇండ్లులేని వారికి ఇండ్ల గురించి దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం క్యాలెండర్లను ఆవిష్కరించారు.ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లలిత గంగాదాస్, ఉపసర్పంచ్ ప్రకాశ్, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ సంజీవ్‌రెడ్డి, వివిధశాఖల అధికారులు, లబ్ధిదారులు, గ్రామప్రజలు పాల్గొన్నారు.


క్యాలెండర్‌లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

అయోధ్య రాముని పూజిత అక్షింతల పంపిణీ


న్యాయాధికారికి అక్షింతలు అందజేస్తున్న దృశ్యం

నిజామాబాద్ అర్బన్, జనవరి 13: అయోధ్య శ్రీరామ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీరామ పూజిత అక్షింతలను విశ్వహిందూ పరిషత్, హిందూ వాహిని ప్రతినిధులు శనివారం పలువురు ప్రముఖులకు అందజేశారు. జిల్లా న్యాయాధికారి సునీత కుంచాల, అడిషనల్ కలెక్టర్ యాదిరెడ్డి, ఆర్మూర్ ఆర్డీవో వినోద్‌కుమార్, టీఎన్‌జీవోస్ అధ్యక్షుడు అలుక కిషన్ తదితరులకు అక్షింతలను అందజేశారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ విభాగ్ కార్యదర్శి కృష్ణ, అధ్యక్షుడు దినేష్ ఠాకూర్, గాజుల దయానంద్, హిందూ వాహిని అధ్యక్షుడు అనిల్, దాత్రిక రమేష్, తదితరులు పాల్గొన్నారు.

● అయోధ్య వరకు సైకిల్ యాత్ర ప్రారంభం...

అయోధ్య రాముడిని దర్శించుకునేందుకు 1200 కిలోమీటర్ల సైకిల్ యాత్రను శనివారం నగరంలోని ఖిల్లా రఘునాథ ఆలయం నుంచి ప్రారంభించారు. నగరానికి చెందిన నరేష్‌గౌడ్, రఘునాథ్ సిద్దుల అనే వ్యక్తులు సైకిల్ యాత్ర ద్వారా అయోధ్య వరకు వెళ్లనున్నారు. ఈ యాత్రను శనివారం విశ్వహిందూ పరిషత్ జిల్లా సహాయ కార్యదర్శి దాత్రిక రమేష్ జెండా ఊపి ప్రారంభించారు.

వర్ని: మండలంలోని తగిలేపల్లి గ్రామంలో అయోధ్య రాములోరి అక్షింతలను గడప గడపకు భజరంగ్‌దళ్ కార్యకర్తలు పంపిణీ చేశారు. ఇంటింటికి తిరుగుతూ రాములోరి అక్షింతలు, చిత్రపటాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో భజరంగ్ దళ్ కార్యకర్తలు ఉజ్వల్, శ్రీకాంత్, కృష్ణ, కిరణ్, నవీన్, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అయోధ్య తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం ఎస్‌హెచ్‌వో సురేష్‌బాబుకు అయోధ్య రాముని అక్షింతలను అందజేశారు. అలాగేఎస్సై అంజమ్మకు అయోధ్యరాముని అక్షింతలను వీహెచ్‌పీ నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి గాజుల దయానంద్, నగర అధ్యక్షుడు గరడి గంగాచరణ్, బోచకర్ నిఖిల్, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

చింతలూర్, తొర్లికొండలో అయోధ్యరాముల అక్షింతల శోభయాత్ర

జక్రాన్‌పల్లి: మండలంలోని వివిధ గ్రామాలలో శనివారం అయోధ్య శ్రీరాముల అక్షింతలను శోభాయాత్రగా ప్రజలు, భక్తులు ఘనంగా జరుపుకున్నారు.మండలంలోని చింతలూర్, తొర్లికొండ, మునిపల్లి గ్రామాలలో అయోధ్య శ్రీరాముల అక్షింతలను ఊరేగింపు నిర్వహించారు. ఆలయంలో అక్షింతలకు ప్రజలు, భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అయోధ్య రాముని అక్షింతలను ప్రజలకు, భక్తులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు, వీడీసీసభ్యులు, తొర్లికొండ, చింతలూర్, మునిపల్లి గ్రామస్థులు పాల్గొన్నారు.

ఘనంగా గోదారంగనాథ స్వామి కల్యాణ వేడుకలు


గోదాదేవి కల్యాణ వేడుకలలో పాల్గొన్న భక్తులు


కమ్మర్‌పల్లిలో స్వామివారి పల్లకి సేవలో పాల్గొన్న భక్తులు

మోస్రా,జనవరి13: మండల కేంద్రంలోని రామాలయం, వేంకటేశ్వరాలయంలో శనివారం గోదారంగనాథ స్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. 21జంటలతో కల్యాణం జరిపించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పురోహితులు శ్రీనివాస్, విఠల్, నవీన్, భూపాల్ రెడ్డి, సుదర్శన్‌గౌడ్, నూలు శివ, విజయ్, వధువరులు మహేష్, రక్షిత, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్: బాల్కొండ మండలంలోని జలాల్‌పూర్ గ్రామంలో కొలువుదీరిన రంగనాథస్వామి దేవాలయంలో ఆదివారం కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతీ సంవత్సరం సంక్రాంతి పర్వదినం పురస్కరించుకొని వేదమంత్రోచ్చారణాల మధ్య రంగనాథస్వామి కల్యాణం జరుగుతోందని అన్నారు. అనంతరం అన్నదానం చేపట్టనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్నిఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మెండోర: మండల కేంద్రంలో కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదా రంగానాయకుల కల్యాణాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకుడు ఆనంద్‌శర్మ శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుడు మాట్లాడుతూ గోదాదేవి ప్రతీనిత్యం రంగనాథుని సేవిస్తూ రోజుకు ఒక మాసం చొప్పున చదివి భక్తిలో మునుగుతోంది. 30రోజులు విష్ణుపురం పూజించి రంగనాథ్‌ని వివాహం మకర సంక్రమము ముందుగా వివాహం చేసుకుంటోందని ఈ కల్యాణాన్ని లోకకల్యాణం భావిస్తారని అన్నారు. గోదారంగా కల్యాణం అనంతరం అన్నదానం నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వీడీసీసభ్యులు, గ్రామప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్: ముప్కాల్ మండలం నల్లూర్ గ్రామంలో లడ్డు బాలాజీ మం దిరంలో ఆదివారం గోదాదేవి కల్యాణం నిర్వహిస్తున్నట్లుఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతీ సంవత్సరం సంక్రాంతి పండగను పురస్కరిం చుకొని ఆలయంలో గోదాదేవికల్యాణం జరుగుతుందని భక్తులు అశేషంగా తరలివచ్చి స్వామివారిని తిలకించాలని తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు ఆలయంలో భక్తుల కొరకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు. అన్నదానం చేపట్టానున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

కమ్మర్‌పల్లి: మండల కేంద్రం శివారులోని పాతిహనుమాన్ ఆలయం వద్ద కొలువుదీరిన రామాలయంలో శనివారం గోదాదేవి రఘునాథస్వామి కల్యాణం అంగరంగవైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ, సత్యనం దశర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వామివారి కల్యాణ ఉత్సవాలకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, శ్రీరాముల రత్నయ్య, వెల్లుల్ల దొంతుల రమణయ్య, బాలకిషన్ గ్రామప్రజలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

కవిత నిజామాబాద్ నుంచి ఎంపీగా పోటీ చేయాలి : ప్రభాకర్‌రెడ్డి

సుభాష్‌నగర్, జనవరి 13: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేయాలని నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. నగరంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంపీగా ఉన్నప్పుడు కవిత పలు అభివృద్ధి కార్యక్రమాలు చేశారని మెడికల్ కళాశాల, కేంద్రీయ విశ్వవిద్యాలయం, సెజ్, రైల్వేలైన్ అభివృద్ధిలు చేశారన్నారు. తెలంగాణ సాంస్కృతి సంప్రదాయాలను ప్రపంచానికి చాటి చెప్పిన ఘనత కవితక్కదేనన్నారు. పార్లమెంట్ అభివృద్ధి కోసం 23.15 కోట్లు ఖర్చు చేసిన ఘనత కవితక్కకే సాధ్యమైందన్నారు. ప్రస్తుత ఎంపీ రూ.5 కోట్లు కూడా ఖర్చు పెట్టకపోవడం దురదృష్టకరమన్నారు. స్థానిక ప్రజల సమస్యల పట్ల అవగాహన ఉన్న ఉద్యమ నాయకురాలు కవిత మళ్లీ నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేయాల్సిందిగా నియోజకవర్గం అభివృద్ధిబాటలో తీసుకెళ్లాలని ప్రజల పక్షాన కోరుతున్నామన్నారు. 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలను ప్రజల ముందు ఉంచి ఆరు గ్యారెంటీలు 420 హామీలను ఇచ్చి ప్రజలనుమోసం చేసి ఓట్లు వేయించుకొని అధికారంలోకి వచ్చిందన్నారు. ఆరుగ్యారెంటీలతో పాటు 420 హామీలను ప్రజలకు అందే వరకు బీఆర్ఎస్ పార్టీ ప్రజల తరపున పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, జిల్లా అధికార ప్రతినిధి సుజిత్‌సింగ్ ఠాకూర్, మాజీ కార్పొరేటర్ ఎనగందుల మురళి, నగర ప్రధాన కార్యదర్శి కరిపెరాజు, యువజన విభాగం అధ్యక్షుడు సత్యప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

తపస్వీ నిలయంలో అన్నదానం

ఆర్మూర్‌టౌన్, జనవరి13: మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి తపస్వీ తేజో నిలయంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు అన్నదానం నిర్వహించారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఫౌండర్ మెల్విన్ జోన్స్ జన్మదినం పురస్కరించుకొని ఆయన సేవలను గుర్తు చేస్తూ విద్యార్థులకు అన్నదానం చేశారు. 1917లో లయన్స్‌క్లబ్ స్థాపనకు అంకురార్పణ చేశారని, ఆయన స్థాపనతో ప్రారంభమైన లయన్స్‌క్లబ్ గత శతాబ్దాకాలంగా నిరుపేదలకు నీడనిచ్చే స్థాయికి నిస్వార్థ సేవల నందిస్తూ పలు సేవ కార్యక్రమాల్లో పాల్గొనడం ఆనందంగా ఉందని లయన్స్‌క్లబ్ సభ్యులు అన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మోహన్‌దాస్, సభ్యులు రూపాలి నర్సయ్య, అంబల్ల తిరుపతి, చెన్న రవికుమార్, లోచర్ తదితరులు పాల్గొన్నారు

పోస్టర్ల ఆవిష్కరణ

సిరికొండ, జనవరి 13:ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయడానికి మూడు కమ్యూనిస్టు విప్లవ పార్టీల ఐక్యత కార్మిక కర్షక విద్యార్థి మేధావులకు స్ఫూర్తిదాయకంగా నిలవనుందని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథ ఆర్మూర్ డివిజన్ సహాయ కార్యదర్శి ఆర్.రమేష్ అన్నారు. శనివారం మండల ప్రజాపంథ కార్యాలయంలో మార్చి 3,4,5వ తేదీల్లో జరిగే జాతీయ స్థాయి మూడు విప్లవ పార్టీల ఐక్యత మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు అనీష్, డివిజన్ నాయకులు బాబన్న, దామోదర్, దుపూరి సాయిరెడ్డి, మండల నాయకులు రమేష్, కిశోర్, లింబన్న, గంగామల్లు, నరేష్, నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.

తొర్లికొండలో వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు

జక్రాన్‌పల్లి, జనవరి13: మండలంలోని తొర్లికొండ గ్రామంలో శనివారం వేంకటేశ్వరస్వామి దేవాలయ ఉత్సవాలను భక్తులు, గ్రామ సులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారు జాము నుంచే భక్తులు కొండపైకి చేరుకున్నారు. అనంతరం స్వామివారి పల్లకీ ని భక్తులు కొండపై చుట్టూ ప్రదక్షిణ చేశారు. ఆలయంలో భక్తులు, గ్రామస్థులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం వద్ద భక్తుల కోసం అన్నదానం నిర్వహించారు. నూతనంగా నిర్మించినున్న వేంకటేశ్వరస్వామి నిర్మాణానికి భక్తులు, గ్రామస్థులు విరాళాలు అందజేశారు.ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వీడీసీ సభ్యులు, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు కరువు



ఆర్మూర్‌లో గురుకుల బాలికల జూనియర్ కళాశాల భవనం



ఆలూర్‌లోని తహసీల్దార్ కార్యాలయం



మెండోరలో అద్దె భవనంలో కొనసాగుతున్న తహసీల్దార్ కార్యాలయం

● కొత్త మండలాల్లో అద్దె భవనాల్లోనే కార్యాలయాలు

ఆర్మూర్‌రూరల్, జనవరి13:ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేకపోవడంతో అద్దె భవనంలోని కార్యాలయాలు కొనసాగుతు న్నాయి. ఆర్మూర్ పట్టణంలో ఎక్సైజ్ కారాయలయం గత 15ఏళ్లుగా అద్దె భవనంలో కొనసాగుతోంది. కాసులు గల గల లాడే ఎక్సైజ్ శాఖకు ఇప్పటికీ సొంత భవనం లేదు. ఎంవీఐ కార్యాలయం సైతం ఏన్నో ఏళ్లుగా అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. అదే విధంగా తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల మహిళ డిగ్రీ కళాశాల అద్దె భవనంలోనే నిర్వహిస్తు న్నారు. పలు మైనారిటీ, ఇతర గురుకుల పాఠశాలలు కూడా అద్దె భవ నాలు కొనసాగుతున్నాయి. హౌసింగ్‌బోర్డుల్లోని అద్దె భవనంలో సాంఘీక సంక్షేమ జూనియర్ కళాశాల కొనసాగుతోంది. ఇటీవల ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి కళాశాలను సందర్శించగా విద్యార్థినిలు తమ సమస్యలు ఏకరువు పెట్టారు. మరుగుదొడ్లు, తరగతి గదులు, భోజన శాల, ఇతర సమస్యలను విద్యార్థినులు ఎమ్మెల్యేకు విన్నవించారు. ప్రైవేటు భవనాల్లో అన్ని మౌళిక వసతులు కల్పించలేమని తెలిసి కూడా ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యం వహించారు. ప్రజలకు మెరుగైన విద్యవైద్యం, అందించినప్పుడే ఉత్తమ ఫలితాలు వస్తాయి. నిర్లక్ష్యంవహిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

● కొత్త మండలాల్లో కార్యాలయాలు వసతులు లేమి

గత ప్రభుత్వం ఆర్మూర్ డివిజన్‌లో ఐదు కొత్త మండలాలను ఏర్పాటు చేసింది. ముందుగా బాల్కొండ నియోజకవర్గంలో ఏర్గట్ల, మెండోర, ముప్కాల్ కొత్తమండలాలను 2019 జులై 6వ తేదీన ప్రారంభించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఏ కార్యాలయానికి సొంత భవనాలు నిర్మించలేదు. ముప్కాల్ మండలంలో తహసీల్దార్ కార్యాలయం వీడీసీ భవనంలో, మండల పరిషత్ కార్యాలయం జీపీభవనం పై అంతస్తులో, పోలీస్‌స్టేషన్ కుల సంఘ భవనంలో కొనసాగుతున్నాయి. ఏర్గట్లలో తహసీల్దార్ కార్యాలయం అద్దె భవనంలో నడుస్తుండగా, ఎంపీడీవో కార్యాలయం ప్రభుత్వ పాఠశాలలో, పోలీస్‌స్టేషన్‌ను గ్రంథాలయ భవనం లో నిర్వహిస్తున్నారు.మెండోరలో తహసీల్దార్ కార్యాలయం వీడీసీ అద్దె భవనంలో కొనసాగుతుండగా, మండల పరిషత్ కార్యాలయాన్ని ప్రభుత్వ పాఠశాలలో, పోలీస్‌స్టేషన్‌ను ప్రభుత్వ ఆసుపత్రికి చెందిన ఒక భవనంలో కొనసాగిస్తున్నారు. మండలాలు ఏర్పాటు చేసి వివిధ గ్రామాల ప్రజలకు పరిపాలన పరంగా సౌకర్యాలు కల్పించినప్పటికీ పక్కా భవనాలు నిర్మిం చకపోవడం శోచనీయం.

● తహసీల్దార్ కార్యాలయం ఒక్కటే..

ఆర్మూర్ మండలం నుంచి ఆలూర్, నందిపేట మండలం నుంచి డొంకేశ్వర్ మండల కేంద్రాలుగా 2022లో ఏర్పాటు చేశారు. ఆలూర్‌లో తహసీల్దార్ కార్యాలయాన్ని వెటర్నరీ ఆసుపత్రి భవనంలో ఏర్పాటు చేశారు. ఈమండలంలో తహసీల్దార్ కార్యాలయం ఒక్కటే ఏర్పాటు చేయ డంతో మండల పరిషత్, విద్యశాఖ, పంచాయతీరాజ్ కార్యాలయాల లో పనులు కావాలంటే ఆర్మూర్‌కు వెళ్ళాల్సి పరిస్థితి నెలకొంది. అదే విధంగా డొంకేశ్వర్ మండలంలో తహసీల్దార్ కార్యాలయం మాత్రమే ఏర్పాటు చేశారు. ఏవో కార్యాలయంలో రైతు వేదిక భవనంలో నిర్వహి స్తున్నారు. ఇతర కార్యాలయాల్లోపనుల కోసం నందిపేటకు వెళ్ళాల్సి వస్తుంది.

● గురుకుల పాఠశాలలకు భూములు కేటాయించినా

ఆర్మూర్ పట్టణంలో అద్దె భవనంలో కొనసాగుతున్న వివిధ గురుకుల పాఠశాలలకు అప్పటి ప్రభుత్వం సొంత భవనాల నిర్మాణాల కోసం స్థలాలను కేటాయించింది. సాంఘీక సంక్షేమ మహిళ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు కొటార్మూర్ శివారులో 150సర్వేనెంబర్‌లో ఏడు ఎకరాలు ప్రభుత్వ భూమిని కేటాయించింది. అలాగే గురుకుల బాలికల నిర్మాణానికి కొటార్మూర్ శివారులోని 150సర్వేనెంబర్‌లోనే ఐదు ఎకరాల్లో కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గురుకుల విద్యాసంస్థల భవనాలకు భూములు కేటాయించినప్పటికీ పక్కా భవనాల నిర్మాణంలో జాప్యం ఏర్పడి ఇప్పటికీ అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. అద్దె భవనాల్లో కొనసాగుతున్న ప్రభుత్వ కార్యాలయాలకు ప్రభుత్వ భూమిని కేటాయించి సొంత భవనాలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా అయ్యప్ప మహాపడి పూజ



అయ్యప్ప పూజ నిర్వహిస్తున్న దృశ్యం

నిజామాబాద్‌అర్బన్, జనవరి 13: అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ నివాసంలో శనివారం అయ్యప్ప మహాపడి పూజ ఘనంగా నిర్వహించారు. నగరంలోని మార్వడీగల్లిలోగల ఎమ్మెల్యే నివాసంలో వేదపండితులు రాజశేఖర్‌శర్మ ఆధ్వర్యంలో వైభవంగా పడిపూజను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ దంపతులు, కన్నెస్వామి ధన్‌పాల్ వినయ్‌కుమార్, ధన్‌పాల్ ప్రణయ్‌కుమార్, ఉదయ్‌కుమార్ పెద్దసంఖ్యలో అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు. ఈసందర్భంగా అయ్యప్ప స్వామి పాటలకు నృత్యాలు చేస్తూ భజన కార్యక్రమాలను నిర్వహించారు.

నవీపేటలో కిక్కిరిసిన మేకల సంత



నవీపేటలోని మేకల సంత దృశ్యం

నవీపేట,జనవరి13: మండల కేంద్రంలో ప్రతీ శనివారం జరిగే మేకల సంత మేకలు, గొర్రెలతో కిక్కిరిసిపోయింది. రాష్టంలోనే ప్రత్యేక గుర్తింపు పొందిన నవీపేట మేకల సంతకు మహారాష్ట్రలోని జల్నా, నాందేడ్, ఔరంగబాద్ తదితర ప్రాంతాల నుంచిపెద్ద ఎత్తున మేకలు, గొర్రెలు తరలివస్తుండగా తెలంగాణలోని పలు జిల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్నాటక, తమిళనాడు తదితర రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున కొనుగోలుదారులు సంతకు వస్తుంటారు. ఈ నెల 16న సంక్రాంతి తర్వాత వచ్చే కనుమ పండుగను పురస్కరించుకుని పెద్ద ఎత్తున మేకలు, గొర్రెలు సంతకు తరలివచ్చాయి. సంతలో ప్రతీవారం సుమారు 10వేల వరకు మేకలు, గొర్రెల విక్రయాలు జరుగుతుండగా ఈ వారం పండుగను పురస్కరించుకుని 15వేలకు పైగా జీవాలు తరలివచ్చాయి. సుమారు రూ.5కోట్ల వరకు క్రయవిక్రయాలు జరిగాయని వ్యాపారులు పేర్కొన్నారు. సంతలో మేక పోతులకు డిమాండ్ అధికంగా ఏర్పడింది. సంతలో మాములు రోజులలో 9వేలకు పలికే మేకపోతు ఈ వారం వెయ్యి నుంచి రూ.2వేల వరకు ప్రతి మేకపోతుపై అధికంగా పలికిందని వ్యాపారస్థులు పేర్కొన్నారు. సంతకు పెద్ద ఎత్తున వాహనాలు రావడంతో పార్కింగ్ సమస్య ఏర్పడింది.

ఆర్మూర్‌లో ముగ్గుల పోటీలు



ముగ్గులను వేస్తున్న విద్యార్థినులు

ఆర్మూర్‌టౌన్, జనవరి 13: పట్టణంలోని కిందిబజార్‌లో క్షత్రీయసమాజ్ ఆధ్వర్యంలో శనివారం ముగ్గుల పోటీలను నిర్వహించారు. క్షత్రీయ సమాజ్ విద్యార్థినిలు,మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ఆకట్టుకునే విధంగా రంగు రంగుల ముగ్గులను వేశారు. దీంతో కౌన్సిలర్‌లు ఖాందేశ్ సంగీత, అల్జాపూర్ రేవతిలు ప్రథమ బహుమతికి రూ.3వేలు, ద్వితీయ బహుమతికి రూ.2వేలు,తృతీయ బహుమతి వెయ్యి, కాన్సోలేషన్ బహుమతులు రూ.500 చొప్పున నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో క్షత్రీయ సమాజ్ అధ్యక్షుడు అజారి మదన్‌మోహన్, కార్యదర్శి బారడ్ గంగామోహన్, రెడ్డి ప్రకాష్, గట్టడి కిషన్, జెస్సు ఆనంద్, వైద్యసంజయ్, అజరి రమేష్, సంతని విజయ్, బారడ్ రమేష్, డికె.శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

కోనాసముందర్‌లో స్మారక క్రికెట్ టోర్నమెంట్



క్రీడాకారుల పరిచయ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

కమ్మర్‌పల్లి, జనవరి 13: మండలంలోని కోనాసముందర్‌లో మిలీనియం ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో చేపట్టిన స్మారక క్రికెట్ టోర్నమెంట్‌ను మండల వైస్ ఎంపీపీ కలేరి శేఖర్, గ్రామ సర్పంచ్ ఇంద్రాల రూప ప్రారంభించారు. గ్రామానికి చెందిన యాట రాజేష్, మనోహర్, గమ్మత్తు రత్నాకర్ స్మారకార్థం ప్రతీఏటా స్మారక టోర్నమెంట్ నిర్వహించబడుతోందని మిలీనియం ఫ్రెండ్స్ యూత్ సభ్యుడు మునిగంటి గంగాధర్ తెలిపారు. టోర్నమెంట్‌లో మండల వైస్ ఎంపీపీ కలేరి శేఖర్, గ్రామ సర్పంచ్ ఇంద్రాల రూప, ఉపసర్పంచ్ పేరం లింబాద్రి క్రీడాకారుల పరిచ య కార్యక్రమం అనంతరం టోర్నీ ప్రారంభమయింది. ఈటోర్నీలో వివిధ గ్రామాలకు చెందిన 20 క్రికెట్ క్రీడాజట్లు పాల్గొంటున్నాయని టోర్నీ ప్రథమ విజేత జట్టుకు రూ.5వేల, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.3 వేల నగదు బహుమతులతో పాటు ట్రోఫీని అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. టోర్నమెంట్ నిర్వాహణకు గ్రామ సర్పంచ్ ఇంద్రాలరూప, వైస్ ఎంపీపీ కలేరి శేఖర్, సింగిల్ విండో ఛైర్మన్ సామబాపురెడ్డి, ఉపసర్పంచ్ పేరంలింబాద్రీల సహకారంతో కొనసాగుతున్నాయని ఈ సందర్భంగా యూత్ సభ్యుల కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు రఘు, అజయ్, ప్రశాంత్, గ్రామ క్రీడాకారులు పాల్గొన్నారు.

బర్ధిపూర్‌లో అర్ధరాత్రి గుప్త నిధుల కలకలం

● గ్రామస్థుల సమాచారంతో నలుగురిని అదుపులో తీసుకున్న పోలీసులు



గుప్త నిధుల తవ్వకాల వద్ద పూజల దృశ్యం, ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

బోధన్ రూరల్, జనవరి 13: నిజామాబాద్ జిల్లా బోధన్ మండలంలోని బర్ధిపూర్ గ్రామంలో గుప్త నిధుల తవ్వకాలు కలకలం రేపాయి. శుక్రవారం అర్ధరాత్రి తవ్వకాలను గమనించిన గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో నలుగురిని అదుపు లోకి తీసుకున్నట్లు ఎస్సై నాగ్‌నాథ్ వెల్లడిం చారు. రూరల్ ఎస్సై నాగ్‌నాథ్ తెలిపిన వివ రాల ప్రకారం.. బర్ధిపూర్ గ్రామానికి చెందిన కూర మహేందర్ ఇల్లు సగం వరకు కూలిపోయింది. గతంలో ఈ ఇంట్లో బోయి వీరయ్య భార్య పిల్లలతో అద్దెకు ఉండేవాడని పేర్కొన్నారు. కూలిన ఇంట్లో గుప్త నిధులు ఉన్నాయని వీరికి మూఢ నమ్మకం ఏర్పడిందని,ఇంటియజమాని కూరమహేందర్ హైదరాబాద్ నుంచి సీతారామ్ చారి అనే మాంత్రికుడ్ని పిలిపించి గుంత తవ్వేందుకు సాయిలు అనే కూలిని రప్పించాడు. వీరం దరూ కలిసి శుక్రవారం అర్ధరాత్రి పసుపు, కుంకుమ, గుమ్మడికాయ, నిమ్మకాలతో నిధి కోసం ప్రత్యేక పూజలు చేశారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో గుప్త నిధుల తవ్వ కాల బండారం బయటపడింది. శనివారం తెల్ల వారు జామున ఘటనాస్థలానికి చేరుకు న్న పోలీసులు నలుగురిని పోలీస్‌స్టేషన్‌కు పిలి పించి విచారించారు. వీరిని బోధన్ తహసీ ల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

ఫోన్‌లలో క్రెడిట్ కార్డుల లింక్స్ ఓపెన్ చేయొద్దు

బోధన్‌రూరల్, జనవరి 13: ఫోన్ వినియోగదారులు క్రెడిట్ కార్డుల లింక్స్ ఓపెన్ చేయొద్దని పట్టణ సీఐ వీరయ్య తెలిపారు. శనివారం బోధన్ పట్టణానికి చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగి తన ఫోన్‌లో క్రెడిట్ కార్డుల లింక్స్ ఓపెన్ చేయడంతో విడతల వారీగా రూ.70 వేల పోగొట్టుకున్నాడని తెలిపాడు. శనివారం సాయంత్రం పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారన్నారు. రోజురోజుకు సైబర్ నేరాలు పెరుగుతున్నప్పటికీ చదువుకున్న వారు, ప్రభుత్వ ఉద్యోగులు సైతం ఇలా మోస పోవడం విచారకర మన్నారు. ఇకనైనా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఫోన్‌లలో వచ్చే ఎటువంటి లింక్స్ ఓపెన్ చేయవద్దని, అపరిచిత వ్యక్తులకు ఓటీపీలు చెప్ప వద్దని ఆయన పేర్కొన్నారు. పండగల వేళ మీఫోన్ గూగుల్‌పే, ఫోన్‌పేలలో పొర పాటున డబ్బులు వచ్చాయంటూ తిరిగి పంపాలంటూ సైబర్ నేరస్తులు ప్రజలను మరో తరహా మోసం చేస్తున్నారన్నారు. ప్రజలు అపరిచిత వ్యక్తుల మాటలు నమ్మవద్దని ఆయన పేర్కొన్నారు.

'క్రీడాకారులకు అండగా ఉంటా'



క్రీడాకారులను అభినందిస్తున్న ఒలంపిక్ సంఘం అధ్యక్షుడు సంజీవ్‌రెడ్డి

మోపాల్, జనవరి 13: క్రీడాకారులకు తాను ఎప్పుడూ అండగా ఉంటానని ఒలంపిక్ జిల్లా అధ్యక్షుడు ఈగ సంజీవ్‌రెడ్డి అన్నారు. బోర్గాం(పి) గ్రామానికి చెందిన రజితకు ముగ్గురు ఆడపిల్లలు. కాగా ఇద్దరు కవల పిల్లలు శ్రీజ, శ్రీష్ట కాగా, మరొకరు లాస్యప్రియలు ఉన్నారు. ఈ ముగ్గురు అక్కాచెల్లెల్లు ఫుట్‌బాల్ క్రీడలో రాణిస్తున్నారు. వీరు శనివారం ఒలంపిక్ జిల్లా అధ్యక్షుడు ఈగసంజీవ్‌రెడ్డిని ఆయననివాసంలో కలువగా ముగ్గురిని సంజీవ్‌రెడ్డి అభినందించారు. ఇద్దరు కవలలు శ్రీజ, శ్రీష్టలు ఎంఎస్‌ఆర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు.మరో అమ్మాయి లాస్యప్రియ ఎస్‌ఆర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. వీరు క్రీడల్లో రాణించడం అభినందనీయమని అన్నారు. చదువుతో పాటు క్రీడల్లో కూడా మంచి గుర్తింపు తీసుకురావాలని అన్నారు. ఫుట్‌బాల్‌కోచ్ నాగరాజుతో మాట్లాడి వీరికి మంచి శిక్షణ ఇచ్చేందుకు తాను కృషి చేస్తానని అన్నారు.క్రీడాకారులకు ఎప్పటికి తాను అండగా ఉంటానని తెలిపారు.

'బోర్లకు జియో ట్యాగింగ్ అవాస్తవం'

సుభాష్‌నగర్, జనవరి 13: వ్య వసాయ బోర్లకు జియో ట్యాగింగ్ పెడుతున్నారన్న సమాచారం. ఇదీ తప్పుడు సమాచారమని టీఎస్ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కార్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. పంపుసెట్లకు జియో ట్యాగింగ్ సంబంధించిన సమాచారం సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తోందని అది తప్పుడు సమాచారమేనని ఇప్పటికీ అలాంటిది ఏమీ లేదన్నారు. రైతులు ఈ సమాచారంతో ఆందోళన చెందొద్దని ఆయన అన్నారు.

ప్రజాపాలన దరఖాస్తుల లబ్ధిదారుల ఎంపిక గ్రామ సభలలో చేపట్టాలి

బోధన్ రూరల్, జనవరి 13: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన దరఖాస్తుల లబ్దిదారుల ఎంపిక కార్యక్రమాన్ని ప్రభు త్వం గ్రామ సభలలో చేయడాన్ని ఆహ్వానిస్తున్నామని సీపీఐఎంఎల్ నాయకులు మల్లేష్ అన్నారు. శనివారం బోధన్ పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో బీఆర్ఎస్ పార్టీ దళిత బంధు, బీసీ బంధు, గృహలక్ష్మి వంటి పథకాలు పార్టీ నాయకు లకు మాత్రమే ఇచ్చారని ఆరోపించారు. క్షేత్రస్థాయిలో సభను నిర్వ హించి లబ్ధిదారులకు ఎంపిక చేయడం పట్ల నిజమైన అర్హులకు న్యాయం జరుగుతోందన్నారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సంద ర్భంగా రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీ ఐదు గ్యారెంటీలపై ప్రజాపాలన లో భాగంగా వాటి అమలుకై ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరిం చింద న్నారు. లబ్దిదారుల ఎంపిక గ్రామాల్లోనే గ్రామసభల ద్వారా ఎంపిక చేయడం జరుగుతోందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రిశ్రీధర్ బాబులు ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి పడాల శంకర్, పీవోడబ్ల్యూ పట్టణ అధ్యక్షులు నాగమణి, సీతారామ్, రాజు, లక్ష్మణ్, ప్రవీణ్, లక్ష్మీనారాయణ, శంకర్,మహిళాసంఘం సభ్యులతో పాటు నాయకులు ఉన్నారు.

హంగర్గ ఫారంలో కూలిన ట్యాంకు పైకప్పు

కోటగిరి,జనవరి13: పొతంగల్ మండలంలోని హంగర్గ ఫారం గ్రామంలో మంచినీటి ట్యాంకు పైకప్పు కూలిపోయి వారం రోజులు కావస్తున్న పట్టించుకోవడం లేదని ఆర్ఎస్‌పీ జిల్లా నాయకులు యార్లగడ్డ సాయిబాబా ఆరోపించారు. పొతంగల్ మండలకేంద్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ట్యాంకు పైకప్పు కూలి వారం రోజులు అవుతున్న ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తిందని వాపోయారు. ట్యాంకు పైకప్పు మరమ్మతులు చేపట్టి తాగునీటి సరఫరా చేపట్టాలని డిమాండ్ చేశారు.

అబ్బాపూర్(బి), నవీపేటలో గ్రామసభలు



నవీపేటలో జరిగిన సమావేశంలో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

నవీపేట,జనవరి13: మండలంలోని అబ్బాపూర్(బి), నవీపేటలలో శనివారం గ్రామసభలు నిర్వహించారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా నిర్వహించిన ఈ గ్రామసభలలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం పంట పొలాలలో డ్రోన్ ద్వారా రసాయన ఎరువులు పిచికారి చేసే విధానాన్ని ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ కార్యక్రమంలో నవీపేట సర్పంచ్ ఏటీఎస్ శ్రీనివాస్, అబ్బాపూర్(బి) సర్పంచ్ జ్యోతి, ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, ఎంపీవో రామకృష్ణ, మెడికల్ ఆఫీసర్ సామ్రాట్ యాదవ్, ఏపీఎం భూమేష్ గౌడ్, నవీపేట ఉప సర్పంచ్ మల్లేష్, అబ్బాపూర్(బి) ఉప సర్పంచ్ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ప్రజా పాలన ఆన్‌లైన్ ప్రక్రియ

కోటగిరి,జనవరి13: కోటగిరి ఉమ్మడి మండలంలో ప్రజా పాలన కింద వచ్చిన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ శనివారంతో ముగిసింది. గత వారం రోజులుగా మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ కొనసాగించారు. కోటగిరి మండలంలో 6732 దరఖాస్తులు ఆన్‌లైన్ చేయగా, పొతంగల్ మండలంలో 7176దరఖాస్తులు ఆన్‌లైన్ చేసినట్లు ఎంపీడీవో మనోహర్ రెడ్డి తెలిపారు.

పేకాట కేంద్రాలపై దాడులు



పేకాట కేంద్రంపై దాడులు చేస్తున్న పోలీసులు

కోటగిరి,జనవరి13: పొతంగల్ మండలంలోని హెగ్డోలి, చేతన్ నగర్ గ్రామాలలో పేకాట కేంద్రాలపై శనివారం ఎస్ఐ సందీప్ దాడులు చేశారు.హెగ్డోలి గ్రామంలో పేకాటరాయుళ్లను పట్టుకుని రూ. 8880 నగదు, చేతన్ నగర్‌లో రూ. 5010 నగదు పట్టుకుని 10మంది పేకాట రాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నవీపేటలో బైక్ చోరీ

నవీపేట,జనవరి13: మండల కేంద్రంలో శనివారం గ్లామర్ బైక్ చోరీకి గురైంది. జన్రాన్‌పల్లికి చెందిన నిఖిల్ నవీపేటలో జరిగే మేకల సంతకు వచ్చాడు. ప్రధాన రహదారి పక్కన బైక్‌ను నిలిపి సంతలో మేకలు కొనుగోలు చేయడానికి వెళ్లాడు. తిరిగి వచ్చే సరికి బైక్ కనిపించలేదని బాధితుడు పేర్కొన్నాడు. ఈ విషయంపై నవీపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు. ఎస్ఐ యాదగిరి గౌడ్‌ను వివరణ కోరగా బాధితుడి ఫిర్యాదు మేరకు విచారణ జరుపుతున్నామని అన్నారు.

జేసీబీ, మొరం టిప్పర్ పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న జేసీబీ, టిప్పర్

నవీపేట,జనవరి13: మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి అక్రమంగా మొరం తవ్వకాలు చేపడుతున్న ఒక జేసీబీతో పాటు మొరం టిప్పర్‌ను పట్టుకోవడం జరిగిందని ఎస్ఐ యాదగిరి గౌడ్ తెలిపారు. స్థానిక లింగమయ్య గుట్టలో అక్రమంగా మొరం తవ్వకాలు జరుపుతున్నారని సమాచారం అందడంతో తాము దాడులు జరిపి ఒక జేసీబీతో పాటు మరో మొరం టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించడం జరిగిందని ఎస్ఐ వివరించారు. సంబంధిత జేసీబీ, మొరం టిప్పర్‌లను మైన్స్ అధికారులకు అప్పగించడం జరుగుతోందని ఎస్ఐ పేర్కొన్నారు.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.130	రూ.200	రూ. 220
వెన్‌కాబ్(కిలో)	రూ.135	రూ.205	రూ. 225

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.64,250	రూ.59,250	రూ.760

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్ర్కీన్-1 : గుంటూరుకారం (9.20, 12.40, 4.00, 7.20, 10.40)
స్ర్కీన్-2 : హనుమాన్ (9.00, 12.20, 3.40, 7.00, 10.20)
స్ర్కీన్-3 : నా సామిరంగ (9.50)
: సలార్ (1.00)
: సైంధవ్ (4.35, 7.35, 10.35)
స్ర్కీన్-4 : మేరి క్రిస్మస్ (తెలుగు) (10.00)
: నా సామిరంగ (1.05, 4.15, 7.25, 10.35)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్ర్కీన్-1 : గుంటూరుకారం (10.25, 1.30, 4.35, 7.40, 10.45)
స్ర్కీన్-2 : నా సామిరంగ (10.20, 1.25)
: హనుమాన్ (7.20)
: సైంధవ్ (10.35)
స్ర్కీన్-3 : హనుమాన్ (10.30, 4.20)
: సైంధవ్ (1.35, 7.35)
: నా సామిరంగ (10.30)

దేవి : హనుమాన్ (11.15, 2.15, 6.15, 9.15)
లలితమహల్ : గుంటూరుకారం (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : నా సామిరంగ (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : సైంధవ్ (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్